క్లుప్తంగా

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో నీటి సమస్య ఉండడంతో గురువారం కొత్తగా బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గోనె మధు, అంకం దుబ్బయ్య తదితరులు ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

కోహెడరూరల్(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ భరోసానిచ్చారు. గురువారం మండలంలోని పరివేద గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాంచంద్రం పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని రామచంద్రాపూర్, బస్వాపూర్, మైసంపల్లి గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, పార్టీ నాయకులు కోక్కుల సురేశ్, నాగరాజు మధుసూదన్‌రావు, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్ తదితరులు ఉన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

కోహెడ(హుస్నాబాద్): విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ అన్నారు. గురువారం ఎస్‌ఎస్‌ఐ నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర కోహెడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. గురుకుల విద్యార్థులకు మెనూ, కాస్మోటిక్ చార్జీలు లేవన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రియంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రశాంత్, కొండం సంజీవ్ కుమార్, నాచారం శేఖర్, సంతోష్, భరత్, మధు, ప్రవీణ్, రాంచరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థులందరూ క్రమశిక్షణతో పాటు సోదరభావం కలిగి ఉండాలని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం 1997 నుంచి అమలులోకి వచ్చిందని, ర్యాగింగ్ చేయడం మన సంస్కృతి కాదని తెలిపారు. ర్యాగింగ్ చట్టం ప్రకారం ఒకసారి కేసు నమోదైతే 6 నెలల నుంచి 3 సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందన్నారు. వ్యక్తులను, వ్యక్తిని అవమానపరచడం, భయపెట్టి, భయం కలిగేట్టు చేయడం, అమర్యాదగా ప్రవర్తించడం, కొట్టడం వంటి అంశాలు ర్యాగింగ్ చట్టంలోకి వస్తాయన్నారు. తెలిసీ తెలియని వయసులో సిగరెట్, గుట్కా, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌బాబు, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ రథం అందజేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రశాంత్‌నగర్ వైకుంఠధామానికి వైకుంఠ రథాన్ని అందించారు. ఐటీసీ సంస్థ గతంలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో ప్రశాంత్‌నగర్ వైకుంఠధామ సుందరీకరణ పనులకు రూ.50 లక్షల రూపాయల నిధులను అందించారు. ఇందులో భాగంగా గురువారం నూతన వైకుంఠ రథాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సుకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాల పంటలపై జాగ్రత్తలు పాటించాలి

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్, ఆరెపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు పత్తి, కంది, వరి నారుమడులు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్ర వేత్త విజయ్ కుమార్, శ్రీదేవి, సరిత మాట్లాడుతూ.. వరి నాడుమడుల్లో కాండం తొలిచే పురుగును గమనించామన్నారు. వరి నాటు వేయడానికి ముందు ఒక ఎకరానికి ఒక కిలో కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలని తెలిపారు. పత్తి పంటలో ఆకుపచ్చ దోమ నివారణకు ఇమిడోక్లోప్రిడ్ ఎకరానికి 100 ఎంఎల్ పిచికారీ చేయాలని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎకరానికి ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 ఎంఎల్ పిచికారీ చేయాలని సూచించారు.

వదలని వాన

- పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు
- పలుచోట్ల రాకపోకలు బంద్
- కూలుతున్న శిథిల ఇళ్లు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా చెరువు, కుంటలకు జలకళ సంతరించుకుంది. పలు గ్రామాల్లో కాజ్‌వేల పైనుంచి నీరు ప్రవహించడంతో పోలీసులు రాకపోకలు బంద్ చేశారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే బయటకు రావాలని సూచిస్తున్నారు. పలు గ్రామాల్లో శిథిల ఇళ్లు కూలుతున్నాయి. మత్తడి పడుతున్న చెరువుల వద్ద చాపలు పట్టేందుకు జాలరులు, యువకులు ఉత్సాహం చూపిస్తున్నారు. పత్తి, వరి పంటల్లో నీరు నిల్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల కాజ్‌వేలు ధ్వంసం కావడంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండలం గుండా పారే మోయతుమ్మెద వాగు పొంగి ప్రవహిస్తోంది. ఖాత, ఘణపూర్, నంగునూరు, అక్కేనపల్లి, సిద్దన్నపేట గ్రామ శివారులో నిర్మించిన ఎనమిది చెక్‌డ్యామ్‌లు నిండి మత్తడి దూకుతున్నాయి. నీటి ఉధృతి క్రమంగా పెరుగుతుండడంతో ఖాత, ఘణపూర్ నుంచి నంగునూరు, అక్కేనపల్లి, బస్వాపూర్ గ్రామాల మధ్య నిర్మించిన మూడు చెక్‌డ్యామ్ కమ్ కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ వాగును సందర్శించి ఘణపూర్ వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కాజ్‌వేను మూసివేశారు. అదేవిధంగా దర్గపల్లి నుంచి సికింద్లాపూర్ మధ్యలో కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి కింది నుంచి ప్రవాహం పెరగడంతో రోడ్డును మూసివేశారు. ఆయా గ్రామాల గుండా వెళ్లే ప్రయాణికులు ఇతర మార్గాల గుండా వెళ్లాలని ఎస్‌ఐ తెలిపారు.



జోరువానలో ఇలా..

పీహెచ్‌సీకి రాకపోకలు బంద్

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ పీహెచ్‌సీకి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షానికి ఆస్పత్రి ప్రాంగణం నీటితో నిండిపోయింది. ఆస్పత్రి గేటు వద్ద నీరు నిండిపోయింది. ఆస్పత్రి వద్ద నుంచి దిగువకు నీరు పోయేందుకు దారిలేకపోవడం.. ఎదురుగా, పక్కకు ఎత్తైన సీసీరోడ్డు ఉండడంతో అధికంగా నీరు నిలిచింది. దీంతో సిబ్బంది ఎలాగోలా తంటాలు పడి ఆస్పత్రి లోపలికి వెళ్లినా రోగులు వెళ్లేందుకు మాత్రం ఇబ్బంది పడ్డారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్ల గ్రామానికి పూజారి రాజయ్య, తాడూరి కనకవ్వ, తాడూరి లింగం ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. గురువారం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు వచ్చి కూలిన ఇళ్లను పరిశీలించారు.

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని కూడవెల్లి వాగు పొంగి పొర్లుతోంది.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని గుందారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జిట్ట లక్ష్మణ్ ఇళ్లు కూలిపోయింది. ఇళ్లు కూలిన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నారు. పెద్ద శబ్దంతో కూలడంతో ఒక్కసారిగా బయటకు పరిగెత్తారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులు ధ్వంసమయ్యాయి.



నంగునూరు(సిద్దిపేట): సిద్దన్నపేట, అక్కేనపల్లి చెక్‌డ్యామ్ నుంచి ప్రవహిస్తున్న నీరు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలంలో నాచగిరి పుణ్యక్షేత్రం వద్ద హల్దీ చెక్‌డ్యామ్ పొంగిపొర్లుతోంది. జబ్బాపూర్‌లో గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్న అద్దెఇళ్లు, వేలూరులో ఉప్పరి కర్రె నర్సయ్య పెంకుటిళ్లకు పాక్షిక నష్టం వాటిల్లింది. శాకారం వద్ద కూకటి వేళ్లతో సహా చెట్టుకూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోగా గ్రామపంచాయతీ అప్రమత్తమై తొలగించింది. భారీ వర్షం నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్, తోటపల్లి శివారుల్లో గల మోయతుమ్మెద వాగులో నీటి ప్రవాహం పెరిగి చెక్‌డ్యామ్‌ల పైనుంచి నీరు ప్రవహిస్తూ జలకళను సంతరించుకున్నాయి.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరు గ్రామ శివారులో వాగు నీరు రోడ్డు మీద నుంచి ప్రవహించడంతో గ్రామస్తులు కొంత ఇబ్బంది పడ్డారు. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కత్తుల సాయిరెడ్డి ఇళ్లు కూలిపోయింది. ఘటనలో సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంటల్లో వర్షం నీరు వచ్చి చేరింది. తిగుల్ గ్రామంలో రాచకట్ట జలాశయం, ధర్మారం గ్రామంలో గల బోరబండ ప్రాజెక్టులోకి వర్షం నీరు వచ్చి చేరింది. అలిరాజ్‌పేటలో చెక్‌డ్యాం పొంగి పోర్లుతోంది. అదేవిధంగా తిగుల్, తిమ్మాపూర్, రాయవరం, చిన్నకిష్టాపూర్, పీర్లపల్లి తదితరత గ్రామాల్లో అంతర్గతరోడ్లు బురదమయంగా



దుబ్బాకరూరల్: పొంగి పొర్లుతున్న కూడవెల్లి వాగు



రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ పీహెచ్‌సీ గేటు వద్ద నిలిచిన వర్షపు నీరు



హుస్నాబాద్‌రూరల్: పందిల్లలో కూలిన ఇల్లు



నంగునూరు(సిద్దిపేట): ఘణపూర్ వద్ద రోడ్డును మూసివేసిన ఎస్‌ఐ



చేర్యాల(సిద్దిపేట): తాడూరు శివారులో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వాగునీరు



బెజ్జంకి(సిద్దిపేట): మోయతుమ్మెద వాగులో ప్రవహిస్తున్న నీరు

స్వచ్ఛ సిద్దిపేట లక్ష్యం



వార్డులో చెత్త సేకరణలో బల్దియా ప్రజాప్రతినిధులు

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేట లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు సూచించారు. గురువారం పట్టణంలోని 43వ వార్డులో నడుచుకుంటూ చెత్త సేకరణ పేరులో వార్డులో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని చెత్త సేకరణపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని సూచించారు. ఆరుబయట చెత్త వేయరాదని, క్లీన్ సిద్దిపేట చేయాలని కోరారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇంట్లో ఉండే వారు వెంటనే ఖాళీ చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు ఎల్లం, తిరుమల్, సుందర్, మొహిజ్, రాజు, శ్రీనివాస్ యాదవ్, విఠోభా, రఘు ఆనంద్, నాగరాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రూరల్ సీఐగా చేరలు



సీపీ శ్వేతకు మొక్క అందజేస్తున్న సీఐ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ సీఐగా వి.చేరలు గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. రూరల్ సర్కిల్ పరిధిలో ఎలాంటి శాంతి భద్రతలకు భంగం కలగకుండా విధులు నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సీఐకి సీపీ సూచించారు.

ఓటరు నమోదుపై అవగాహన ఉండాలి

హుస్నాబాద్: ఓటరు నమోదు, తొలగింపు, ఓటరు మార్పుపై బీఎల్‌ఓలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ బెన్ షాలమ్ అన్నారు. గురువారం పట్టణంలో నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులకు ఎలక్ట్రానిక్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. బీఎల్‌ఓలకు ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి కానీ నియోజకవర్గం మార్పు కోసం బీఎల్‌ఓలకు అవగాహన కల్పించినట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ బెన్ షాలమ్

ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంజీవ్‌కుమార్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్క బీఎల్‌ఓలు ఓటరు నమోదు, ఫీల్డ్ వెరిఫికేషన్, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై పూర్తిస్థాయిలో అవగాహ కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ప్రతి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటర్లకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాయపోలు(దుబ్బాక): రానున్న సాధారణ ఎన్నికల కోసం ఓటరు జాబితా సవరణలపై బూత్ స్థాయి అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాయపోలు తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలకు స్థానికంగా ఉన్న రైతువేదికలో శిక్షణ ఇచ్చారు. ఓటరు నమోదు, తొలగింపు తదితర అంశాలపై చర్చించారు.

ఎంసీహెచ్ పనుల పరిశీలన

గజ్వేల్: గజ్వేల్‌లో తుది దశకు చేరుకుంటున్న మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి(ఎంసీహెచ్) పనులను 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి గురువారం పరిశీలించారు. త్వరలోనే ఆస్పత్రిని అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ పాల్గొన్నారు. కాగా పత్తి మార్కెట్ యార్డు పనులను సైతం 'గడా' ప్రత్యేకాధికారి పరిశీలించారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన డీసీసీబీ చైర్మన్



కొండపాక(గజ్వేల్): సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గరీమా అగర్వాల్‌ను గురువారం డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందేలా చూస్తూ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలని కోరారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు ఉన్నారు.

సీఐ బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలోని పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వహించే సీఐ దేవయ్య రామగుండం కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు వెలువరించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ జేజేల వెంకటేశం, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండ మధులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్ పట్టణాల నుంచి గ్రామాల వరకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో 70 ఏళ్లలో జరగని అభివృద్ధి 9ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధిలో ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. విమర్శలు మానుకొని అభివృద్ధి కోసం కలసిరావాలని హితవు పలికారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో గురువారం బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేన్సర్, కిడ్నీ, బీపీ, షుగర్ పలు రకాల ఆరోగ్య సమస్యలపై హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి మండలాలకు చెందిన మహిళా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. ప్రత్యేకించి మహిళలు ప్రతి ఆరు నెలలకొకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ సదస్సులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బాల వికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, డాక్టర్ ధర్మా, గైనకాలజిస్ట్ రమాదేవి, వాటర్ ఫెడరేషన్ డైరెక్టర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బాల వికాస ప్రతినిధులు జ్యోతి, నిర్మల ఉన్నారు.

భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని కిషనగర్‌లో నిర్మిస్తున్న ఐఓసీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆర్డీఓ బెన్ షాలమ్ అన్నారు. గురువారం నూతన భవన నిర్మాణ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. వీరి వెంట పీఆర్‌ఏఈ మథిన్ ఉన్నారు.

విద్యుత్ పేరుతో మోసం

సిద్దిపేటరూరల్: రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్నామంటూ అబద్ధాలు చెబుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యవర్మ అన్నారు. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరాఫరా సంబంధిత లాగ్‌బుక్‌ను సూర్యవర్మ పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, పత్రికా విలేకరులు వచ్చినా లాగ్‌బుక్స్ చూపించకుండా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 20 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నారని ఇది కాంగ్రెస్ సాధించిన విజయమని, కాంగ్రెస్ మాటతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చినట్లయిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ భూ కమిటీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌ముదిరాజ్, మండల అధ్యక్షుడు రాములు, నాయకులు వెంకట్, చిరంజీవియాదవ్, రమేశ్, మున్న, హర్షద్, శివ కుమార్, రఘు, నవీన్, కుమార్, రాజు, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటామని, త్వరలో జరిగే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి సైదులు మాదిగ డిమాండ్ చేశారు. గురువారం జగదేవ్‌పూర్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకు ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో–కన్వీనర్ కృష్ణ, రాములు, నాయకులు ఆంజనేయులు, గణేశ్, అరుణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పండ్ల తోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

కోహెడరూరల్(హుస్నాబాద్): హుస్నాబాద్ డివిజన్‌లో 5 ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు పండ్ల మొక్కలు పెంచుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని డివిజన్ హార్టికల్చర్ అధికారి రవళి గురువారం తెలిపారు. మామిడి, నిమ్మ, నారింజ, జీడిమామిడి, జామ, సీతాఫలం, సపోట, ఆయిల్‌పామ్, నేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ, మునగ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి వంటివి పెంచుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కల కొనుగోలు నుంచి నాటడంతో పాటు నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. జాబ్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారులు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

◆ ఆర్థికసాయం

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం దొమ్మాటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అక్కముల కనకయ్య అనారోగ్యంతో బాధపడుతూ లక్ష్మక్కపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా అతడిని గురువారం ఆస్పత్రిలో పరామర్శించిన దొమ్మాటకు చెందిన ట్రాక్టర్ యాజమానులందరూ కలిసి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.


◆ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌ను దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ జిల్లాలో దివ్యాంగులు పడుతున్న కష్టాలు, సమస్యలపై వివరించారు. స్పందించిన అదనపు కలెక్టర్ రాబోవు రోజుల్లో దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని చెప్పినట్లు తెలిపారు.

◆ ఎస్సీ, ఎస్టీ, అత్యాచార చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి

సిద్దిపేటకమాన్: ఎస్సీ, ఎస్టీ, అత్యాచార చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన జిల్లా సదస్సులో జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం పరిరక్షణకు ఐక్య ఉద్యమం చేపట్టాలని తీర్మానించామన్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 5న సిద్దిపేటలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, 10వ తేదీన డివిజన్, మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 14న సిద్దిపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, ఎమ్మార్పీస్ టీఎస్ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: దళితుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వర్గల్ మండలం గిర్మాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయ ఆవరణలో ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విషప్రచారంతో ముందుకుసాగుతున్నాయని, ప్రజలు వారి మాటలు నమ్మేస్థితిలో లేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వర్గల్ ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, జెడ్పీటీసీ బాలుయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మురళీగౌడ్, నాయకులు భూంరెడ్డి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.